క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు అందజేత



బాధితురాలికి నగదు అందజేస్తున్న సర్పంచ్

సైదాపురం: మండలంలోని రామసాగరం గ్రామానికి చెందిన నిగిగుంట శ్రీనివాసులు ఇటీవల మృతిచెందారు. మృతుని భార్య సక్కు బాయికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.10వేల నగదును సర్పంచ్ వెంకటరత్నమ్మ అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ కార్తీక్‌రాజు, వలంటీర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం



ఈఓకు విరాళ చెక్కును అందజేస్తున్న దాతలు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన కొనెగారి సాయిసూరజ్‌రెడ్డి, కుమారి సుదీప్తి కుటుంబసభ్యులందరూ కలిసి రూ.2,02,232 నగదు చెక్కును ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డికి బుధవారం అందజేశారు. అమ్మవారికి మొక్కు చెల్లించుకునేందుకు వారు అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ కార్యాలయంలో నగదు చెక్కును ఈఓకు అందజేశారు. ఆలయ పాలకమండలి సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా రోడ్డు మరమ్మతు పనులు

చిట్టమూరు: సూళ్లూరుపేట–కోట మార్గంలో పూలతోట నుంచి, తాడిమేడు మలుపు వరకు తారు రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు ఆర్‌అండ్‌బీ డీఈ పరమేశ్వరి బుధవారం తెలిపారు. పూలతోట గ్రామం 9వ కిలోమీటర్ నుంచి తాడిమేడు మలుపు రోడ్డు వరకు 9 కిలో మీటర్లు తారురోడ్డు మరమ్మతు పనులు చేస్తున్నారన్నారు. రోడ్డుపై పడ్డ గుంతలకు ప్యాచ్‌వర్క్ పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా గోపుర కలశ ప్రతిష్ట

చిల్లకూరు: పొన్నవోలు పంచాయతీలోని మొగిలిగుంట కొత్తపాళెం గ్రామంలో కొత్తగా నిర్మించిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం గోపుర కలశ ప్రతిష్ట బుధవారం వైభవంగా జరిగింది. వేద పండితులు రుక్మిణి, సత్యభామ, వేణుగోపాలస్వామి మూలమూర్తులకు అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఆలయ శిఖరంపై కలశం ఉంచి శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు.

ఆర్టీసీ కార్మికుల రక్తదానం



రక్తదాతలతో డీఎం, వైద్యులు

కోట: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్టీసీ కార్మికులు రక్తదానం చేశారు. కోట సీహెచ్‌సీలో 20 మంది ఆర్టీసీ సిబ్బంది వాకాడు డిపో మేనేజర్ మధుశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. డీఎం మాట్లాడుతూ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ప్రతిరోజూ ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. రక్తదానం చేసిన కార్మికులను అభినందించారు. కంట్రోలర్ జార్జి పాల్గొన్నారు.

సహకార బ్యాంకుల బలోపేతం

– డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అండతో సహకార బ్యాంకులను బలోపేతం చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న డీసీసీలో బుధవారం బ్యాంకు పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత పాలక మండలి సమయంలో బ్యాంకు వ్యాపార లావాదేవీలు రూ.1,100 కోట్లు కాగా నేడు రూ.1,700 కోట్లకు చేరుకున్నామన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా రైతులకు ఇప్పటికే సబ్సిడీపై 280 ట్రాక్టర్లు అందించామన్నారు. జిల్లాలోని అన్ని సొసైటీలను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొస్తున్నామన్నారు. సీఎం ఆదేశాల మేరకు అప్కాబ్ సహకారంతో మండలానికి ఒక బ్యాంకు బ్రాంచ్‌ని ఏర్పాటు చేసేలా సన్నాహాలు చేస్తున్నామన్నారు. బ్యాంకు సీఈఓ డాక్టర్ శంకర్‌బాబు, పాలకమండలి సభ్యులు చలమారెడ్డి, రమణారెడ్డి, అలీ, నాబార్డ్ డీడీఎం రవిసింగ్, డీసీఓ తిరుపాల్‌రెడ్డి, బ్యాంకు జీఎం సరిత పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీలకు కండలేరు విద్యార్థి



అభినందిస్తున్న హెచ్‌ఎం

రాపూరు: రాపూరు మండలం కండలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాయినాథ్ జాతీయస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 30న కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన 66వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ త్రోబాల్ పోటీల్లో నెల్లూరు జిల్లా తరఫున అండర్–14 విభాగానికి జిల్లా టీం కెప్టెన్‌గా వ్యవహరించి రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ కనబరచడంతో జాతీయస్థాయి జట్టుకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. సాయినాథ్‌ను విద్యార్థికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు కామాక్షిని బుధవారం పాఠశాల్లో అభినందించారు.

తెల్లవారుజామ నుంచే పింఛన్ల పండగ

- 90 శాతానికి పైగా పింఛన్ల పంపిణీ
- ఇళ్ల వద్దకే వెళ్లి వలంటీర్లు పంపిణీ



నాయుడుపేట: మంచంలో లేవలేని స్థితిలో ఉన్న వృద్ధుడికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ భారతి



నాయుడుపేట: వృద్ధురాలికి పింఛన్ ఇస్తున్న వెల్ఫేర్ కార్యదర్శి కిషోర్‌బాబు

నాయుడుపేటటౌన్: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో బుధవారం సాయంత్రానికి 90 శాతానికి పైగా పింఛన్‌లను పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 4,202లకు పింఛన్‌లకుగాను సాయంత్రం వరకు 3,925 పింఛన్లు పంపిణీ చేశామన్నారు. 13 సచివాలయాలకు సంబంధించి వలంటీర్లు తెల్లవారుజాము నుంచే పింఛన్‌ల పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. కొన్ని సచివాలయాలకు సంబంధించి అడ్మిన్‌తో పాటు వెల్ఫేర్ కార్యదర్శులు పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకే వంద శాతం పింఛన్‌లను పంపిణీ చేసిన పలువురు వలంటీర్లు, సచివాలయ అధికారులకు కమిషనర్ అభినందించారు.

90 శాతం పింఛన్ల అందజేత

చిల్లకూరు: ప్రతినెలా ఒకటవ తేదీన అందించే సామాజిక పింఛన్‌లను బుధవారం వలంటీర్‌లు ఇంటి వద్దకు పొద్దు, పొద్దునే వెళ్లి అవ్వ,తాతలకు పింఛన్ అందించారు. మండలంలోని 31 పంచాయతీలలో వలంటీర్లు పింఛన్ సొమ్మును మంగళవారం రాత్రికే అందుకున్నారు. దీంతో వలంటీర్లు వేకువజామునే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందించారు. వల్లిపేడు పంచాయతీలోని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుడైన సోగా వెంకటస్వామి అనే వృద్ధుడికి చక్రవర్తి అనే వలంటీర్ పింఛన్ అందజేశారు. మండలంలో 90శాతం పింఛన్లు ఒకే రోజు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

వేకువజాము నుంచే పింఛన్ల అందజేత

దొరవారిసత్రం: మండలం పరిధిలో బుధవారం పింఛన్లను వలంటీర్లు వేకువజాము నుంచే లబ్ధిదారులకు అందజేశారు. వివిధ రకాల పింఛన్లు 4,919 గాను సాయంత్రానికి 4,747 మందికి పింఛన్లు అందజేశారు. 96.5శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. పోలిరెడ్డిపాళెం గ్రామ సచివాలయం పరిధిలోని ముత్రాసపాళెం గ్రామానికి చెందిన శ్రీరాముల రమణమ్మ గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఈక్రమంలో గత నెల నుంచి నెల్లూరులో డయాలసిస్ చేసుకుంటూ ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు సీకేడీ పింఛన్ మంజూరు చేసింది. బుధవారం సంబంధిత సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వలంటీర్ సునీత బాధితురాలికి పింఛన్ నగదు రూ.10వేలు అందజేశారు.

ఇంటి వద్దకే పింఛన్లు

సైదాపురం: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో బుధవారం ఉదయం 6గంటల నుంచే అట్టహాసంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వలంటీర్లు ప్రారంభించారు. కొత్తగా మంజూరైన పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి వలంటీర్లు పింఛన్లను పంపిణీ చేశారు.



ఏరూరులో పింఛన్ ఇస్తున్న వలంటీర్



అనంతమడుగులో దివ్యాంగబాలుడికి పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ గురుభార్గవి



ముత్రాసపాళెంలో సీకేడీ పింఛన్ రూ.10వేలు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది



ఏకొల్లులో పింఛన్ ఇస్తున్న సిబ్బంది



కలిచేడుగ్రామంలో సుబ్బయ్యకు పింఛన ఇస్తున్న వలంటీర్ కావేరి

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

దొరవారిసత్రం: కొత్తపల్లి గ్రామ సచివాలయం పరిధిలో గురువారం మధ్యాహ్నం 2గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొననున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని వైఎస్సార్ సీపీ శ్రేణులు తెలిపాయి.

పదవి బాధ్యతను పెంచింది

గూడూరు: తనకు ఇచ్చిన పదవి, తనపై మరింత బాధ్యతను పెంచిందని రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా ఎంపికైన బి. శ్యాంసుందరరావు పేర్కొన్నారు. స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవన్‌లో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ సతీష్‌బాబు, రొటేరియన్‌లు డాక్టర్ జనార్దన్‌రెడ్డి, రోహిణితోపాటు శ్రీకంటి రామ్మోహన్‌రావు బుధవారం ఘనంగా సత్కరించారు. రొటేరియన్‌లు శ్రీనివాసులు, ధనుంజయ రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, మునిగిరీష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డీఈ

సైదాపురం: రూ.1.60 కోట్ల వ్యయంతో సైదాపురం మండల పరిషత్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులను బుధవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. పంచాయతీరాజ్ డీఈఈ ఏడుకొండలు మాట్లాడుతూ రూ.60లక్షలు మండల గ్రాంట్, కోటి రూపాయలు జిల్లా పరిషత్ నిధులతో మండల నూతన భవన నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ ఏఈ దయాల్ పాల్గొన్నారు.

పాఠశాలను ఎంఈఓ తనిఖీ



సింగనాలత్తూరు పాఠశాలలో విద్యార్థుల విద్యాభ్యాసాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

దొరవారిసత్రం: నేలపట్టు, సింగనాలత్తూరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఎంఈఓ మస్తానయ్య తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం అందుతోందా లేదా అని ఆరా తీశారు. పాఠశాలలోని వివిధ రికార్డులను తనిఖీ చేశారు. సింగనాలత్తూరు పాఠశాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నాడు–నేడు నిధుల వెచ్చింపు, పనుల నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎంలు రవీంద్ర కుమార్, హరి ఉన్నారు.

జాతీయస్థాయికి కొండగుంట విద్యార్థినులు



విద్యార్థినులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

గూడూరురూరల్: కొండగుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు బుధవారం పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వరరావు తెలిపారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినులను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా జి. కొండూరులో గత నెల 28నుంచి 30వ తేదీ వరకు జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి అండర్–17 పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొన్నారని అన్నారు. ఈ పోటీల్లో సింగిల్స్ విభాగంలో జి.ద్రాక్షాయిణి, పి. సౌమ్య, ఎస్.భూమిక మంచి ప్రతిభ కనబరిచారని దీంతో వీరిని జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి క్రీడల్లో శిక్షణ ఇచ్చిన భాస్కర్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి పూజలు



శ్రీ అలఘునాథస్వామి ఆలయంలో తులసి పూజ చేస్తున్న మహిళలు

గూడూరు: పట్టణంలోని పలు ప్రాంతాల్లోని వైష్ణవ దేవాలయాల్లో భీష్మ ఏకాదశి సందర్భంగా దేవదేవుళ్లను ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాయుడుపేటటౌన్: భీష్మ ఏకదాశి సందర్భంగా మండల పరిధిలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న ప్రసూనాంభ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద గణపతి హోమం, ఏకాదశి రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలను భక్తిశ్రద్ధలతో జరిపారు.

వాకాడు: బాలిరెడ్డిపాళెం గ్రామంలో వెలసిన పట్టాభిరామాలయంలో బుధవారం భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108



గూడూరు: రోడ్డు ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై బుధవారం ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌లో 108 వాహనం కూడా చిక్కుకుంది. దీంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాల డ్రైవర్లే కిందికి దిగి 108 వాహనం వెళ్లేలా చొరవ చూపారు. జాతీయ రహదారిపై బద్దెవోలు క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం తెల్లవారుజామున రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో గంటకుపైగా ట్రాఫిక్ స్తంభించింది. ఆ తర్వాత ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. మధ్యాహ్నం ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీసే క్రమంలో మళ్లీ గంటకుపైగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనాల్లోని ప్రయాణికులకు మళ్లీ ఇబ్బందులు తప్పలేదు. ట్రాఫిక్‌లో 108 కూడా చిక్కుకుంది. ట్రాఫిక్‌లో చిక్కుకున్న బస్సు డ్రైవర్లు 108కు దారి కల్పించారు.

నిషేధిత ప్లాస్టిక్ వాడితే చర్యలు

వెంకటగిరి: దుకాణాల్లో ప్రభుత్వం నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తెలిపారు. పట్టణంలోని పలు దుకాణాల్లో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని పలు కూడళ్లల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించిందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడి చేసేందుకు వార్డు సచివాలయ సిబ్బంది నిత్యం తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



భద్రావతి సమేత భావర రుషిస్వామివారి కల్యాణోత్సవం

వెంకటగిరి: పట్టణంలో రెండు రోజులుగా జరుగుతున్న భద్రావతి సమేత భావనరుషి తిరునాళ్లలో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. మల్లమ్మగుడి వీధి, ఎన్టీఆర్‌కాలనీ, ఉపాధ్యాయనగర్, సాలి కాలనీ ప్రాంతాల్లో ఉదయం తిరునాళ్లలో భాగంగా కలశాల ఊరేగింపు జరిగింది. ఆయా ఆలయాల్లో వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య జరిగిన కల్యాణోత్సవాన్ని భక్తులు కన్నుల పండువగా తిలకించారు. రాత్రి స్వామివార్ల గ్రామోత్సవం వేడుకగా జరిగింది.

ఇళ్లను త్వరితగతిన పూర్తిచేయండి

వాకాడు: జగనన్న లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన వాకాడు–1 సచివాలయ ఆవరణలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ రత్నమ్మ, ఉప సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, రవీంద్ర పాల్గొన్నారు.

చికెన్ దుకాణంలో చోరీ

సూళ్లూరుపేట రూరల్: కోటపోలూరు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న చికెన్ దుకాణం పైకప్పు రేకులను పగులగొట్టి గుర్తు తెలియని దుండగులు దుకాణంలోకి చొరబడి చోరీ చేశారు. కోటపోలూరు గ్రామానికి చెందిన మీజూరు మోహన్‌బాబు జాతీయ రహదారి సమీపంలోని కోటపోలూరు వెళ్లే మార్గంలో చికెన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. 31వ తేదీ రాత్రి చికెన్ దుకాణం మూసుకుని ఇంటికెళ్లాడు. బుధవారం యథావిధిగా దుకాణం తెరిచాడు. దుకాణం పైకప్పు రేకులను పగలగొట్టి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దుకాణం రూ.13,800 నగదుతో పాటు గ్యాస్ సిలిండర్ చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

సైదాపురం: ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. తూర్పుపూండ్ల గ్రామంలో బుధవారం ఐసీఐసీఐ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సర్పంచ్ వెంకటరత్నమ్మ, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు ప్రారంభించారు. శిబిరంలో గామస్తులు కంటి పరీక్షలు చేసుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా అద్దాలను పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. సిబ్బంది మస్తానమ్మ, గోపాల్, మస్తానయ్య పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

తడ: మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్టు ఎంపీపీ కొళివి రఘురెడ్డి బుధవారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30కి సమావేశం మొదలవుతుందని అధికారులు, ప్రజాప్రతినిదులు అందరూ హాజరై గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరు, ప్రస్తుతం నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం చర్చించాలని కోరారు.

సమయపాలన పాటించాలి

వెంకటగిరిరూరల్: సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు విధుల్లో సమయపాలన పాటించాలని లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కోటేశ్వరరావు పేర్కొన్నారు. జంగాలపల్లి సచివాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది హాజరులో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలపై సచివాలయాలకు వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తంబిరెడ్డి తనూజా రెడ్డి, నేతలు శివారెడ్డి, వైస్ ఎంపీపీ భూపతి సుధాకర్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మస్తాన్, సర్పంచ్ ప్రమిల, మనోహర్, గుర్రం రవి, సుబ్రమణ్యం, రాజేంద్ర, పాల్గొన్నారు.

జేసీబీతో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది, చిత్రంలో కమిషనర్

గూడూరు: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుని ఉండగా, మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ బుధవారం వాటిని జేసీబీ వాహనంతో తొలగించేలా చర్యలు తీసుకున్నారు. రెండవ పట్టణ పరిధిలోని మినీ బైపాస్ రోడ్డుకు ఆనుకుని పలు ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి. ఈ మేరకు ఆ శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ సమాచారంతో మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ సిబ్బందితోపాటు, జేసీబీని తీసుకెళ్లి, ఆ ప్రాంతంలోని ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సకాలంలో పనులు పూర్తిచేయాలి



అమృత్ సరోవర్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

వెంకటగిరిరూరల్: ఎన్‌ఆర్ఐజీఎస్ ద్వారా చేపడుతున్న అమృత్ సరోవర్ పనులు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ సకాలంలో పనులు పూర్తిచేయాలని ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి పేర్కొన్నారు. జంగాలపల్లి పంచాయతీలో బుధవారం రూ.7.5లక్షలతో అమృత్ సరోవర్ పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కూలీల సంఖ్యను పెంచేందుకు నీటిని నిల్వచేసే దిశగా చేపడుతున్న పనులకు అర్హులకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. కూలీలు నగదు, బిల్లుల విషయంలో అధికారులు జాప్యం చేయకుండా వెంటనే కూలీల ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఏపీఓ దీప, వైస్ ఎంపీపీ భూపతి సుధాకర్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తుమ్మూరు మస్తాన్, జంగాలపల్లి సర్పంచ్ పాలూరు ప్రమీల, మనోహర్, నేతలు గుర్రం రవి, సుబ్రమణ్యం, రాజేంద్ర పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

పెళ్లకూరు: వ్యవసాయ సాగులో రైతులందరూ మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రాష్ట్ర వ్యవసాయశాఖ పరిశీలకులు డాక్టర్ జి. వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నెలబల్లి, జీలపాటూరు గ్రామాల్లో జరిగిన పొలంబడి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసుకున్న రైతులందరూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ పంటల ఎంపిక చేసుకోవాలన్నారు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా క్రిమిసంహారక నివారణ కోసం వినియోగించే పురుగులమందు విషయంలో శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్‌రావు, ఏడీఏ ధనుంజయరెడ్డి, ఏఓలు ప్రవీణ, గణేష్, వీఏఏలు చందు, రాజేష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

ఓజిలి: నుడా ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ రజినీకాంత్ అన్నారు. గ్రద్ధగుంట పంచాయతీ పరిధిలో జ్యోష్యులవారికండ్రిగ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఉగాదికి ఇళ్లన్నీ వందశాతం పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇంటి పనుల్లో జాప్యం లేకుండా సకాలంలో బిల్లులు మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శివప్రసాద్, ఏపీఓ ఉషారాణి, ఈసీ మహేష్‌కుమార్, కార్యదర్శి రేణుక, వలంటీర్లు పాల్గొన్నారు.